ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట
3
బుధవారం 14 ఫిబ్రవరి 2024





పట్టణంలోని స్వచ్ఛబడి

చెత్త పనికి రాకుండా పోదని, దాంతో ఆదాయం పొందొచ్చని 2021లో సిద్దిపేటలో 'స్వచ్ఛబడి'కి శ్రీకారం చుట్టారు. ఇప్పుడు ఈ స్వచ్ఛబడి రాష్ట్రంతో పాటు దేశంలోని పలు ప్రాంతాలకు ఆదర్శంగా నిలుస్తున్నది. పట్టణంలో 43 వార్డుల్లో ప్రతీ ఇంటి నుంచి తడి, పొడి హానికర చెత్తను సేకరించి 39వ వార్డులో ఏర్పాటైన స్వచ్ఛబడి ఆర్‌ఆర్‌ఆర్‌ఆర్ (రీయూజ్, రెడ్యూజ్, రీసైకిల్, రెఫ్యూజ్)పేరుతో సరికొత్త అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తూ అందరి చేత శభాష్ అనిపించుకుంటుంది. చెత్తపై పాఠాలు చెబుతుండడంతో జిల్లాలోని పలు పాఠశాలల విద్యార్థులే కాకుండా ఇతర జిల్లాలు విద్యార్థులు కూడా వస్తున్నారు. అలాగే రాష్ట్రాలు, కేంద్రం నుంచి ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, వీవీఐపీలు స్వచ్ఛబడిలో పాఠాలు వినేందుకు ఉత్సాహం చూపుతున్నారు.


బీరు సీసాలతో ఏర్పాటు చేసిన స్వాగత తోరణం

స్వచ్ఛబడిని చూసొద్దాం

- మున్సిపాలిటీ సేకరిస్తున్న చెత్తపై అవగాహన
- ఎరువు కోసం స్లాట్లు బుక్ చేసుకుంటున్న రైతులు
- మున్సిపల్‌కు స్వచ్ఛబడి నుంచి ఏడాదికి రూ. 40 వేలు ఆదాయం
- సిద్దిపేట స్ఫూర్తితో గతేడాది నుంచి రాష్ట్రమంతటా అమలుకు శ్రీకారం

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 13 : సిద్దిపేటలోని 43 వార్డుల్లో సేకరిస్తున్న తడి, పొడి, హానికర చెత్తను మున్సిపల్ సిబ్బంది ఏం చేస్తున్నారు. వాటిని ఎక్కడకు తీసుకెళ్తున్నారు. వాటితో ఏమేమి తయారు చేస్తారు అన్న దానిపై స్వచ్ఛబడి కేంద్రంగా విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. సిద్దిపేట అభివృద్ధిని చూసేందుకు వచ్చిన వారికి స్వచ్ఛబడి కార్యాలయంలో డిజిటల్ క్లాస్ ద్వారా మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు, స్థానిక వార్డు కౌన్సిలర్ దీప్తినాగరాజు, పర్యావరణ ప్రేమికురాలు డాక్టర్ శాంతి అవగాహన కల్పిస్తున్నారు. స్వచ్ఛతపై విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించి బహుమతులు అందజేస్తున్నారు. రెండేళ్ల నుంచి దాదాపు 7వేల మంది విద్యార్థులు, 6 వేలకు పైగా ప్రజాప్రతినిధులు, అధికారులు, వంద మందికి పైగా వీవీఐపీలు స్వచ్ఛబడిని సందర్శించారంటే ఇక్కడ చెప్పే పాఠాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.


స్వచ్ఛత పాఠాలు వింటున్న విద్యార్థులు (ఫైల్)


సేకరించిన తడిచెత్తను చాపర్ మిషన్‌లో వేస్తున్న సిబ్బంది

వర్మి కంపోస్టు తయారీ

పట్టణంలోని కేవలం 39 వార్డులో ఇంటింటి నుంచి సేకరించిన తడి చెత్తతో స్వచ్ఛబడిలో వర్మి కంపోస్టును తయారు చేస్తున్నారు. వార్డులో సేకరించిన దాదాపు క్వింటాల్నర తడిచెత్తను స్థానిక స్వచ్ఛబడికి తరలిస్తారు. అక్కడ వివిధ పద్ధతుల ద్వారా ఎరువును తయారు చేస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తవడానికి దాదాపు 45 నుంచి 48 రోజులు పడుతుంది.

స్వచ్ఛబడి ఎరువుకు డిమాండ్

సిద్దిపేటలోని స్వచ్ఛబడిలో తయారు చేస్తున్న వర్మి కంపోస్టు ఎరువుకు డిమాండ్ ఉంది. స్వచ్ఛబడిలోని ఎరువుతో మంచి ఫలితాలు వస్తుండడంతో పాటు కిలో రూ.2కే లభిస్తుండడంతో జిల్లాలోని పలువురు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఎరువు తీసుకునేందుకు స్లాట్‌లు బుక్ చేసుకుంటున్నారు. మిద్దె తోటలు నిర్వహించే వారు కూడా ఈ ఎరువును కొనుగోలు చేస్తున్నారు.

ఎటుచూసినా పచ్చదనమే

స్వచ్ఛబడిలో ఎక్కడా చూసిన పచ్చదనమే కనిపిస్తుంది. పనికి రావు అనుకున్న ప్లాస్టిక్ బాటిళ్లు, థర్మకోల్ డబ్బాలు, సీసం గ్లాసులు, పాడైన కారు టైర్లు, డ్రమ్ములలో అందమైన మొక్కలు, కూరగాయల మొక్కలు, బిర్యానీ ఆకు, మామిడి చెట్లు, దానిమ్మ, సపోట, తులసి చెట్లు, జామ, ఉసిరి, అరటి ఇలాఎన్నెన్నో మొక్కలను పెంచుతున్నారు. పచ్చదనాన్ని, పర్యావణాన్ని కాపాడేందుకు చేస్తున్న పలు కార్యక్రమాలకు ఈ స్వచ్ఛబడి అధ్యయన కేంద్రంగా మారింది. గతేడాది మాజీ ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి, రాజన్నసిరిసిల్లా ఎమ్మెల్యే కేటీఆర్ సందర్శించి సిద్దిపేట స్వచ్ఛబడిలో చేస్తున్న కృషిని అభినందిస్తూ రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలలో అమలు చేయాలని ఆదేశించారు.

మరిన్ని అవార్డులు సాధిస్తాం



సిద్దిపేట మున్సిపాలిటీకి దక్షిణ భారతదేశంలో 20కి పైగా అవార్డులు రావడంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావే మాకు మార్గ దర్శకుడు. సిద్దిపేట పట్టణాన్ని దేశ, రాష్ట్ర స్థాయిలో అందరూ మెచ్చుకునేలా అభివృద్ధి చేసిన ఘనత ఆయనకే దక్కుతుంది. ఆయన సూచనలు, సలహాలు పాటిస్తూ పట్టణాన్ని అన్నింటా అభివృద్ధి చేశాం. రాబోయే రోజుల్లో మరిన్ని అవార్డులు వచ్చేలా మరింత అభివృద్ధి చేసుకుంటాం.

- కడవేర్గు మంజులరాజనర్సు, సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్

అందరికీ అవగాహన కల్పిస్తున్నాం



39వ వార్డులో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రత్యేక చొరవతో ఏర్పాటు చేసిన సచ్ఛబడిలో సిద్దిపేటలో సేకరిస్తున్న చెత్తపై అందరికి అవగాహన కల్పిస్తున్నాం. పట్టణానికి వచ్చేవారికి అర్థమయ్యేలా వివరిస్తున్నాం. స్వచ్ఛబడిలో చెత్త నుంచి సంపదను సృష్టించి మున్సిపల్‌కు దాదాపు రూ. 40వేలకు పైగా అందించాం. మహిళలు నెలసరి సమయాల్లో వాడే ప్యాడ్స్, చిన్నారుల డైపర్స్‌పై అవగాహన కల్పిస్తున్నాం.

- దీప్తినాగరాజు, 39వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్, సిద్దిపేట


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, సీపీ

మాదక ద్రవ్యాలను అరికట్టాలి

- కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

సిద్దిపేట అగ్రికల్చర్, ఫిబ్రవరి 13: జిల్లాలో మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపి వాటిని అరికట్టాలని కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో సీపీ అనురాధతో కలిసి 'మిషన్ పరివర్తన' అమలుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. సిద్దిపేట జిల్లాలో గంజాయి, గుండుబా, డ్రగ్స్ ఇతరత్రా మత్తుపదార్థాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వాటిని అరికట్టాలన్నారు. విద్యార్థులు మత్తుపదార్థాలకు బానిసకాకుండా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీల ప్రిన్సిపల్స్, అధ్యాపకులు యాంటీ డ్రగ్ కమిటీలుగా ఏర్పడాలని చెప్పారు. అనంతరం సీపీ అనురాధ మాట్లాడారు. జిల్లాలో మాదకద్రవ్యాల సరఫరాను పూర్తిస్థాయిలో అంతం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కువగా బీహార్, ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చిన వలస కూలీలు మాత్రమే వీటిని తీసుకొస్తున్నారన్న సమాచారం ఉందని ఆమె చెప్పారు. జిల్లాలో మాదక ద్రవ్యాలపై ఎలాంటి సమాచారం అందినా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అనంతరం డ్రగ్ ఈజ్ బగ్, సే గుడ్ బాయ్ డ్రగ్స్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసమూర్తి, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ వినయ్ సుస్మిత, డీఎఫ్‌వో శ్రీనివాస్, డీడబ్ల్యూవో రామ్‌గోపాల్‌రెడ్డి, డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, సిద్దిపేట , గజ్వేల్ ఆర్డీవోలు రమేశ్‌బాబు, బన్సీలాల్, డీఎంహెచ్‌వో కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా పథకాల అమలు

కేంద్ర ప్రభుత్వ సెక్టోరియల్ లెవల్-డీ 15 మంది ఉద్యోగుల బృందం జిల్లాలో పర్యటన ముగించుకుని మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్‌తో సమావేశం అయ్యారు. ఈనెల 6 నుంచి 13 వరకు బృందం సభ్యులు జిల్లాలో అభివృద్ధి పథకాల అమలుపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడంలో జిల్లా ఆదర్శంగా నిలిచిందని వారు కొనియాడారు.

బదిలీల పరంపర

సిద్దిపేట అగ్రికల్చర్/ సిద్దిపేట క్రైం/గజ్వేల్, ఫిబ్రవరి 13: జిల్లాకు చెందిన పలువురు అధికారులు సోమవారం బదిలీ అయిన విషయం తెలిసిందే. మంగళవారం కూడా మరికొందరు బదిలీ అయ్యారు. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి రాంగోపాల్‌రెడ్డి ఖమ్మం జిల్లాకు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారిగా బదిలీ అయ్యారు. జిల్లాకు కొమురంభీమ్-ఆసిఫాబాద్‌లో పూర్తి అదనపు బాధ్యతలుగా డీడబ్ల్యూవో విధులు నిర్వహిస్తున్న సావిత్రి వచ్చారు. ఈ మేరకు ఆమె కలెక్టరేట్ కార్యాలయంలోని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ కార్యాలయంలో పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. మరో రెండు నెలల్లో ఆమె ఉద్యోగ విరమణ చేయనున్నట్లు సమాచారం. బదిలీపై వెళుతున్న రాంగోపాల్‌రెడ్డిని ఆ శాఖ ఉద్యోగులు సన్మానించారు.

గజ్వేల్ ఏసీపీగా బాలాజీ



గజ్వేల్ ఏసీపీగా బాలాజీని నియమిస్తూ రాష్ట్ర డీజీపీ రవిగుప్తా ఉత్తర్వులను జారీ చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో చాలా రోజులుగా పనిచేస్తున్న గజ్వేల్ ఏసీపీ మడత రమేశ్, సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ ప్రసన్నకుమార్‌ను డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. గజ్వేల్ ఏసీపీగా బాలాజీని నియమించగా, సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీగా సుమన్‌కుమార్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం గజ్వేల్ ఏసీపీ బాలాజీ బాధ్యతలు స్వీకరించనున్నారు.

అడిషనల్ డీసీపీ అడ్మిన్ బదిలీ

జిల్లా అడిషనల్ డీజీపీ అడ్మిన్ అందె శ్రీనివాస్ హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు సోమవారం రాత్రి ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.

గౌరాయపల్లిలో దొంగల బీభత్సం

- ఆరు ఇళ్లలో చోరీ
- బంగారం, వెండి ఆభరణాలు, నగదు అపహరణ

చేర్యాల, ఫిబ్రవరి 13: కొమురవెల్లి మండలం గౌరాయపల్లిలో సోమవారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. ఒకేరోజు ఆరు ఇళ్లలో బంగారం, వెండి ఆభరణాలతో పాటు నగదును అపహరించారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గౌరాయపల్లికి చెందిన నీల కనకయ్య అతని భార్య నర్సవ్వ కొమురవెల్లిలో హోటల్ నిర్వహిస్తూ అక్కడే ఉంటున్నారు. ఇంటి వద్ద ఉన్న అతని కొడుకు వంశీ తాళం వేసి పక్కింట్లో నిద్రించాడు. గ్రామానికి చెందిన దొంతరబోయిన భిక్షపతి కుటుంబంతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లాడు. బండి మల్లవ్వ కూడా కుటుంబంతో కలిసి తమ బంధువుల ఇంటికి వెళ్లింది. మరో ఇంటికి చెందిన సన్నపురి రాములవ్వ ఒంటరి మహిళ కావడంతో పక్కింట్లో నిద్రించింది. అలాగే బొచ్చు లక్ష్మీ కూడా పక్కింట్లో నిద్రించింది. ఒంటరి మహిళ అయిన నరెడ్ల మల్లవ్వ గ్రామంలోని తన కూతురు ఇంటికి వెళ్లింది. ఆయా నివాసాలకు తాళం వేయడాన్ని గమనించిన ఆగంతకులు చోరీకి పాల్పడ్డారు. నీల కనకయ్య ఇంట్లో 10 తులాల బంగారం, దొంతరబోయిన భిక్షపతి ఇంట్లో రూ.2.80లక్షలు నగదు, బొచ్చు లక్ష్మీ నివాసంలో తులం బంగారం, 6 తులాల వెండి ఆభరణాలు, రూ.21వేలు నగదు అపహరించారు. బండి మల్లవ్వ ఇంట్లో 25 తులాల వెండి, తులం బంగారం, రూ.4వేలు చోరీకి గురైంది. సన్నపురి రాములవ్వ ఇంట్లో 20తులాల వెండి పట్టాగొలుసులు, రూ.6వేల నగదు, నరెడ్ల మల్లవ్వ ఇంట్లో సుమారు రూ20 వేల నగదు చోరీకి పాల్పడ్డారు. సమాచారం అందుకున్న చేర్యాల సీఐ శ్రీను, కొమురవెల్లి ఎస్ఐ నాగరాజు ఆయా ఇళ్లను పరిశీలించారు. బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. క్లూస్‌టీంను రప్పించి వేలి ముద్రల నమూనాలను సేకరించారు.


వివరాలు తెలుసుకుంటున్న సీఐ శ్రీను, ఎస్ఐ నాగరాజు


దొంగల చేతిలో ధ్వంసమైన బీరువా

కొన్నినెలల క్రితమే..

కొన్నినెలల క్రితం ఇదే గ్రామంలో ఒకేరోజు పలు ఇళ్లలో చోరీ జరిగింది. ఆ కేసులను చేధించకముందే మరోసారి దొంగతనం జరగడం గమనార్హం. అంతేకాక నీల కనకయ్య ఇంట్లో రెండోసారి చోరీ జరగడంతో కుటుంబీకులతో పాటు గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. దొంగలు పట్టుకోవడంతో పాటు పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గౌరాయపల్లి గ్రామస్థులు కోరుతున్నారు.

నాలుగోవారం బుకింగ్ ఆదాయం రూ.56.12 లక్షలు

చేర్యాల, ఫిబ్రవరి 13: కొమురవెల్లి మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగోవారం రూ.56.12 లక్షల మేర బుకింగ్ ఆదాయం సమకూరినట్లు ఆలయవర్గాలు తెలిపాయి. భక్తులు మొక్కుబడిగా సమర్పించిన తలనీలాలు, ఆర్జిత సేవలు, పట్నాలు, బోనాలు, ప్రసాద విక్రయాలు, ప్రత్యేక దర్శనాలు, వసతి గదుల అద్దె తదితరాల ద్వారా శనివారం రూ.4,32,331, ఆదివారం రూ.44,99,038, సోమవారం రూ.6,81,552 చొప్పున మొత్తం రూ.56,12,921 ఆదాయం సమకూరింది. గతేడాది సుమారు రూ.48.49లక్షలు రాగా ఈ ఏడాది రూ.7.50లక్షలు పెరిగింది. మల్లన్న జాతరకు తోడు మేడారం, వేములవాడ రాజన్న ఆలయానికి భక్తులు తరలివస్తుండటంతో ప్రతీవారం ఆదాయం పెరుగుతున్నది.

అడ్వాన్స్‌గా అడ్మిషన్ల దందా!

- పరీక్షలకు ముందే ప్రచారం షురూ!
- కార్పొరేట్ విద్యాసంస్థల నిర్వాకం
- పీఆర్వోలతో ప్రతిరోజు విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్లు

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 13: జిల్లాలోని కొన్ని కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నియమ నిబంధనలను గాలికి వదిలేసి అడ్మిషన్ల దందాను మొదలుపెట్టారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్ అడ్మిషన్ల ప్రక్రియను ఇప్పటి నుంచే ప్రారంభించారు. ప్రైవేట్ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల ఫోన్ నంబర్లు సేకరించి నిత్యం వారికి ఫోన్లు చేస్తున్నారు. ఇప్పుడు అడ్మిషన్ తీసుకుంటే ఫీజు తక్కువగా ఉంటుందని, అనేక సౌకర్యాలు ఉంటాయని తమ కాలేజీల్లోనే చేర్పించాలని ఒత్తిడి తెస్తున్నారు.

అడ్మిషన్ల కోసం హైదరాబాద్‌లోని ప్రైవేట్ విద్యాసంస్థల పీఆర్వోలు జిల్లా కేంద్రంలో తిష్టవేశారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రైవేట్ స్కూళ్లతో పాటు పలు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులతో విందులు ఏర్పాటు చేసి మచ్చిక చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇంకొందరికి బహుమతులు ప్రకటిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో కూడా సమావేశాలు, విందులు ఏర్పాటు చేసి అడ్మిషన్లు పొందేందుకు ఆఫర్లు ప్రకటిస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా..

పదో తరగతి పరీక్షలు కాక ముందే ఇంటర్మీడియట్ అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టడం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధం. ఫలితాలు వచ్చాక మే, జూన్‌లో ఆయా కాలేజీలు అడ్మిషన్లను స్వీకరించాలి. జిల్లాలో మాత్రం అందుకు విరుద్ధంగా కొనసాగుతున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదని, నిత్యం కాలేజీల నుంచి వచ్చే ఫోన్లతో విసిగిపోతున్నామని తల్లిదండ్రులు వాపోతున్నారు.

ముందుగా అడ్మిషన్లు తీసుకోకూడదు

- సూర్య ప్రకాశ్‌రావు, డీఐఈవో



ప్రైవేట్ విద్యాసంస్థలు పదోతరగతి పరీక్షలకు ముందే ఇంటర్మీడియట్ అడ్మిషన్లను తీసుకోకూడదు. ప్రైవేటు కాలేజీలలో ముందస్తుగా అడ్మిషన్లు చేపడితే మా దృష్టికి తీసుకురావాలి. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటాం. పదోతరగతి ఫలితాలు వెలువడిన తర్వాత, ఇంటర్మీడియట్ బోర్డు నోటిఫికేషన్ వేసిన అనంతరం అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించాలి.



త్వరలో గజ్వేల్‌లో క్రికెట్ లీగ్

- వేలంపాటలో క్రీడాకారుల కొనుగోలు
- 10 టీంలతో పోటీల నిర్వహణ

గజ్వేల్, ఫిబ్రవరి 13 : గజ్వేల్‌లో త్వరలో క్రికెట్ లీగ్ మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. ఐపీఎల్ తరహాలో 'జీసీఎల్' (గజ్వేల్ క్రికెట్ లీగ్) పేరుతో గజ్వేల్‌లోని మైదానంలో టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఇందుకోసం కొన్ని రోజులుగా నిర్వాహకులు కసరత్తు చేస్తున్నారు. మంగళవారం పట్టణంలోని కోలాభిరాం గార్డెన్‌లో క్రీడాకారుల వేలం పాట నిర్వహించారు. క్రికెట్‌లో మంచి నైపుణ్యం గల 90 మంది క్రీడాకారులను ఎంపిక చేయగా, ఒక్కో క్రీడాకారునికి వేలంపాట నిర్వహించారు. టీం ఓనర్లు వేలంపాటలో ఉత్సాహంగాపాల్గొన్నారు. మొదటిసారి ఐపీఎల్ తరహాలో క్రీడాకారుల కోసం వేలం నిర్వహించిన నేపథ్యంలో రూ.25 వేల లోపు 10 మంది క్రీడాకారులను కొనుగోలు చేసే విధంగా నిర్వాహకులు నిబంధన పెట్టారు. దానికి అనుగుణంగా 90 మంది క్రీడాకారులతో ఒక్కో టీంలో 9 మంది చొప్పున 10 టీంలు క్రీడాకారులను కొనుగోలు చేశాయి. ఫిబ్రవరి చివరి వారంలో ఈ టోర్నమెంట్ నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం నిర్వహించిన వేలంపాటకు విశేష స్పందన లభించిందని నిర్వాహకులు తెలిపారు.


గజ్వేల్‌లో క్రికెట్ లీగ్ కోసం వేలంపాట నిర్వహిస్తున్న దృశ్యం

ముస్తాబైన వర్గల్ విద్యాధరి క్షేత్రం

- నేడు వసంత పంచమి మహోత్సవం


విద్యాధరి క్షేత్రం

వర్గల్, ఫిబ్రవరి 13: వర్గల్ విద్యాధరి క్షేత్రం బుధవారం జరిగే వసంత పంచమి (శ్రీ పంచమి) మహోత్సవానికి ముస్తాబైంది. వేడుకల సందర్భంగా ఆలయాల సముదాయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. వసంత పంచమి పర్వదినం సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో తెల్లవారుజామున 4 గంటలకు గణపతి పూజలో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. పూజల అనంతరం సరస్వతీ అమ్మవారికి లక్ష పుష్పార్చన చేస్తారు. ఉత్సవాల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

హాజరుకానున్న పీఠాధిపతులు, ప్రజాప్రతినిధులు

క్షేత్రానికి తొగుట రాంపురం పీఠాధిపతులు మాధవానంద సరస్వతీ స్వామి, నాచారం శ్రీ పీఠం పీఠాధిపతులు శ్రీమధుసూదనానంద సరస్వతీ స్వామిజీ హాజరుకానున్నారు. అలాగే రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్, సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, జిల్లా డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి, సిద్దిపేట జడ్పీచైర్‌పర్సన్ వేలేటి రోజా రాధాకృష్ణశర్మ గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, విజయదుర్గ ఆలయ వ్యవస్థాపకులు చెప్పెల హరినాథశర్మతో పాటు పలువురు అధికారులు, ఇతర ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు హాజరుకానున్నారు. వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ వ్యవస్థాపకులు యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి తెలిపారు. వేడుకలకు సుమారు 50 వేల మంది భక్తులు తరలిరానున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆలయ అక్షరాభ్యాస మండపంలో సుమారు 5వేల మంది చిన్నారులకు అక్షర స్వీకారాలు చేసే విధంగా వసతులు కల్పించినట్లు తెలిపారు.


నడిరోడ్డుపై చదును చేయకుండా వదిలేసిన మట్టికుప్ప

నడిరోడ్డుపై ప్రమాదకరంగా మట్టికుప్ప

చేర్యాల, ఫిబ్రవరి 13: పనుల్లో జాప్యం వాహనదారులకు ఇబ్బందిగా మారింది. కొమురవెల్లి శివారులోని నూతన పోలీస్‌స్టేషన్ భవన సమీపంలో ప్రధాన రహదారిపై ఇటీవల ఏర్పడిన గోతి పూడ్చివేసేందుకు మంగళవారం మట్టి, మొరం పోసినా చదును చేయకపోవడంతో ప్రమాదకరంగా మారింది. సమీపంలోని ఓ ప్రైవేటు భవనం నుంచి ప్రవహిస్తున్న మురుగు నీటి కారణంగా రోడ్డు దెబ్బతినడంతో పాటు వాహనాల రాకపోకలతో చిత్తడిగా మారి మల్లన్న భక్తులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయమై ఇటీవల ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కావడంతో గుంత పూడ్చివేతకు మొరం మట్టిని రోడ్డుపై కుప్పగా పోశారు. చదును చేయడం విస్మరించారు. మట్టి కుప్ప చీకట్లో కనిపించక ప్రమాదాలకు ఆస్కారం ఉన్నందున సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సికింద్రాబాద్‌కు తరలిన ఎమ్మార్పీఎస్ నాయకులు

గజ్వేల్, ఫిబ్రవరి 13: సికింద్రాబాద్‌లో జరుగుతున్న ఎమ్మార్పీఎస్, దాని అనుబంధ సంఘాల జాతీయస్థాయి సమావేశానికి సిద్దిపేట జిల్లా నుంచి ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్ జిల్లా బృందం మంగళవారం తరలివెళ్లింది. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముంద్రాతి కృష్ణ మాట్లాడుతూ సికింద్రాబాద్‌లో మందకృష్ణ, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ వర్గీకరణపై చర్చించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట నాయకులు పెర్క పరశురాములు, సామ్రాట్ ప్రకాశ్, ముక్కపల్లి రాజు, బింగి పవన్ కళ్యాణ్, చేబర్తి మహేశ్, శ్రీహరి సింధు, ఉబ్బని అంజనేయులు, శంకర్, జితేందర్, శనిగిరి రమేశ్, కొక్కొండ నర్సింహులు, మినుముల కరుణాకర్, పెరిక ప్రశాంత్, డాకని రాజు తదితరులున్నారు.

ముందస్తు టీకాలతో వ్యాధుల నివారణ

పశు సంవర్ధకశాఖ ఏడీ రమేశ్‌బాబు


నబినగర్‌లో టీకాల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఏడీ రమేశ్‌బాబు

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 13: జీవాలకు ప్రభుత్వం అందించే ఉచిత టీకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రమేశ్‌బాబు సూచించారు. జగదేవ్‌పూర్ మదిర గ్రామమైన నబినగర్‌లో మంగళవారం మేకలు, గొర్రెలకు పీపీఆర్ (తల్లివ్యాధి నివారణ) టీకాల కార్యక్రమాన్ని ఏడీ, మండల పశువైద్యాధికారిని శ్వేతతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవాలను పెంపొందించుకునే ప్రతీ రైతు ముందస్తుగా టీకాలు వేసుకోవడం వల్ల చాలా వరకు వ్యాధులను నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమం ఈ నెల 24 వరకు కొనసాగుతుందని తెలిపారు. మండల పరిధిలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు, నబినగర్ గ్రామంలో సుమారు 1,141 గొర్రెలకు టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వీఏ శ్రీనివాస్, ఓఎస్ హరిప్రసాద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతి పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న గిరిజన సంఘాల నాయకులు

హుస్నాబాద్, ఫిబ్రవరి 13 : ఈ నెల 15వ తేదీన హుస్నాబాద్ పట్టణంలో నిర్వహించే సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాల మహా భోగ్ బండార్ కార్యక్రమ పోస్టర్‌ను మంగళవారం బంజారాభవన్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరవుతున్నారని, నియోజకవర్గంలోని బంజారాలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బీలునాయక్, గిరిజన సంఘాల నాయకులు ధరావత్ తిరుపతి నాయక్, భిక్షపతినాయక్, సోమ్లు నాయక్, భాస్కర్ నాయక్, రాజు నాయక్, రూప్‌సింగ్, రాంబాబు నాయక్, మోతీలాల్ నాయక్, బిక్యా నాయక్, సత్యంనాయక్, శంకర్ నాయక్ తదితరులున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు భూంపల్లి విద్యార్థి

క్రీడాకారుడికి ఆర్థిక సహాయం

మిరుదొడ్డి, ఫిబ్రవరి 13: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన బొమ్మనమైన రమేష్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. అండర్ 16 రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ షాట్‌పుట్ పోటీలకు ఎంపికైన రమేష్‌ను మంగళవారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అభినందించడంతో పాటు రూ.5వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ నెల 16న గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో జరిగే అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొననున్నట్టు తెలిపారు. రమేష్‌ను పాఠశాల పీఈటీ వెంకట్‌రెడ్డి, నాయకులు నరేష్, ప్రభాకర్ అభినందించారు.

బ్యాంకు లింకేజీలో రాష్ట్రంలోనే ప్రథమస్థానం

● గ్రామీణాభివృద్ధి సంస్థకు కలెక్టర్ ప్రశంసలు

మెదక్, ఫిబ్రవరి 13: గామీణాభివృద్ధి సంస్థ బ్యాంకు లింకేజీలో రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించడం జిల్లాకే గర్వకారణమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా ప్రశంసించారు. మంగళవారం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా బ్యాంకర్ల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2023 త్రైమాసికానికి సంబంధించి జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ వంద శాతం లక్ష్యం సాధించి, రాష్ట్రంలో ప్రథమస్థానం రావడం జిల్లాకు గర్వకారణమన్నారు. పట్టణాభివృద్ధి సంస్థ కూడా వందశాతం లక్ష్యం సాధించినట్లు తెలిపారు. మొత్తం రుణ ప్రణాళికలో వ్యవసాయ, వ్యాపార, ముద్ర, వీధి వ్యాపారుల ఉపాధికి రుణాలు పంపిణీ చేశామని వివరించారు. మొత్తం రుణ ప్రణాళికలో రూ. 3796.28 కోట్ల లక్ష్యానికి గానూ రూ.2874.32 కోట్ల లక్ష్యానికి చేరుకుని రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించామన్నారు. 2024-25 సంవత్సరానికి నాబార్డు బ్యాంకు సౌజన్యంతో రూపొందించిన పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ బోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి గోవిందు, మెప్మా పీడీ ఇందిర, జిల్లా అధికారులు విజయ లక్ష్మి లీడ్ బ్యాంకు మేనేజర్ రెహ్మాన్, నాబార్డు డీడీఎం సెసిల్ తిమోతి, ఎస్‌బీఐ ఆర్ఎం. అరుణ జ్యోతి, ఏపీజీవీబీ రీజినల్ ఉదయ్ కిరణ్, పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల సమక్షంలో మాక్ పోలింగ్

పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో భాగంగా మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నిబంధనల మేరకు ఎఫ్ఎల్‌సీ నిర్వహించినట్లు వివరించారు. ఈవీఎం, వీవీ ప్యాట్‌ల ఓట్లు మాక్ పోలింగులో వేసిన ఓట్ల లెక్కలు సరిపోలాయన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రమేష్, ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఎలక్షన్ సూపరింటెండెంట్ హర్దీప్‌సింగ్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

లిక్కర్ స్కాంలో మహిళా లోకానికి మచ్చగా ఎమ్మెల్సీ కవిత

● మహిళల అభ్యున్నతికి కాంగ్రెస్ పెద్దపీట
● పార్లమెంట్ ఎన్నికల్లో అంకిత భావంతో పని చేద్దాం
● రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునితారావు



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునితారావు

సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 13 : లిక్కర్ స్కాంలో దేశ వ్యాప్తంగా కల్లోలం సృష్టించిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మహిళా లోకానికే మచ్చగా నిలిచిందని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునితారావు ఆరోపించారు. సంగారెడ్డిలోని సిటీ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన మెదక్ పార్లమెంటరీ నియోజకవర్గ కాంగ్రెస్ మహిళా కార్యకర్తల సమావేశానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా సునితారావు మాట్లాడుతూ గడిచిన పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ మహిళలకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. ఆ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల మహిళలపై అరాచకాలు, అఘాయిత్యాలు పెరిగి పోయాయన్నారు. బంగారు తెలంగాణ సాధిస్తామన్న కేసీఆర్ అప్పుల తెలంగాణగా మార్చారన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో అవినీతి, అక్రమాలు పెరిగాయన్నారు. అన్ని వర్గాలను మోసగించిన బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు చరమగీతం పాడారన్నారు. మహిళల అభ్యున్నతికి కాంగ్రెస్ పెద్దపీట వేసిందన్నారు. రాజకీయంగా, ఆర్థికంగా మహిళలను బలోపేతం చేసిన ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. మాజీ మంత్రులు సబితారెడ్డి, సునితారెడ్డి, సత్యవతి రాథోడ్‌లకు రాజకీయ భిక్ష పెట్టింది కాంగ్రెస్సేనన్నారు. బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం మహిళలకు ప్రాధాన్యత ఇవ్వలేకపోయాయన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు అంకిత భావంతో పని చేయాలని సూచించారు. ఇందు కోసం అన్ని మండలాలు, గ్రామాల్లో కమిటీలు వేసి మహిళా కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతం కోసం కష్టపడే వారిని అధిష్ఠానం గుర్తించి పదవుల్లో ప్రాధాన్యతనిస్తుందన్నారు. నారాయణఖేడ్, జహీరాబాద్, అందోల్ నియోజకవర్గాల్లో మహిళా కాంగ్రెస్‌ను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. గ్రూపు రాజకీయాలకతీతంగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని సునితారావు సూచించారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధారాణి, పీసీసీ కార్యదర్శి తోపాజి అనంత కిషన్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడితోనే మెడికో ఆత్మహత్య

● మార్చిలో ఎంగేజ్‌మెంట్‌కు ఏర్పాట్లు.. అంతలోనే దారుణం
● ఎవరిపైనా అనుమానం లేదని స్పష్టం చేసిన కుటుంబసభ్యులు

పటాన్‌చెరు, ఫిబ్రవరి, 13: సంచలనం రేకెత్తించిన పీజీ మెడికో రచనారెడ్డి ఆత్మహత్యకు మానసిక ఒత్తిడే ప్రధాన కారణమని తేలింది. సోమవారం అమీన్‌పూర్ పోలీసుస్టేషన్ పరిధిలోని కిష్టారెడ్డిపేట గ్రామ శివారులో ఔటర్ రింగ్ రోడ్డుపై ఆగి ఉన్న కారులో ప్రాణాంతక ఇంజక్షన్ అధిక మోతాదులో తీసుకుని రచనారెడ్డి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఎంతో భవిష్యత్తు ఉన్న ఒక మెడికో ఈ తరహాలో ఆత్మహత్యకు పాల్పడటం ప్రతి ఒక్కరినీ కలచివేసింది. ఆమె ఆత్మహత్యకు గల కారణాలపై ఇంకా పోలీసులు ఒక నిర్ధారణకు రాలేకపోతున్నారు. కుటుంబ సభ్యులు సైతం రచనకు ఎవరితోను విబేధాలు లేవని, ఎవరిపైనా అనుమానాలు లేవని తేల్చిచెప్పడంతో ఆత్మహత్య మిస్టరీగా మిగిలిపోయింది. పటాన్‌చెరు ఏరియా ఆసుపత్రి వద్ద రచనారెడ్డి కుటుంబ సభ్యులు, బంధువులు పోస్టుమార్టం తరువాత ఆమె మృతదేహాన్ని అంత్యక్రియల కోసం రామచంద్రాపురం తరలించారు. లభ్యమైన ప్రాథమిక ఆధారాలు, కుటుంబ సభ్యుల వాంగ్మూలం నమోదు చేసుకున్న తరువాత కేవలం ఒత్తిడి మూలంగానే ఆత్మహత్యకు పాల్పడినట్లు భావిస్తున్నారు. బాచుపల్లి మమత వైద్య కళాశాలలో పీజీ గైనకాలజీ ఇంటర్న్‌షిప్ చేస్తోన్న రచనారెడ్డికి ఇటీవలే ఓ అబ్బాయితో పెద్దలు వివాహం కుదిర్చారు. మార్చిలో ఎంగేజ్‌మెంట్‌కు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఎంగేజ్‌మెంట్ షాపింగ్, పెళ్లి ఈవెంట్లపై రచన చురుగ్గా వ్యవహరిస్తూ నిత్యం సంతోషంగా కనిపించేదని, అంతలోనే ఘోరం జరిగిపోయిందని తల్లిదండ్రులు, సోదరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చదువులో ఎంతో చురుగ్గా ఉండే రచన చిన్నప్పటి నుంచి ధైర్యంగా ఉండేదని చెబుతున్నారు. పెళ్ళి నిశ్చయమైన యువకుడితో ఏమైనా మనస్పర్థలు వచ్చాయా అన్న కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. ఆత్మహత్యకు ముందు ఫోన్‌సంభాషణలు విశ్లేషిస్తూ, ఎవరెవరిని కలిసింది. స్నేహితులు, సన్నిహితుల నుంచి వివరాలను సేకరిస్తున్నారు. ఆత్మహత్యకు అరగంట ముందు కూడా సంతోషంగా ఉందని చెబుతున్నారు. కాగా ప్రాణాంతక ఇంజక్షన్ ఎక్కడ, ఎప్పుడు కొనుగోలు చేసింది అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు ముందే ప్లాన్ చేసుకుందన్న అనుమానాలు బలపడుతున్నాయి.

మల్లన్న రైల్వేహాల్ట్‌స్టేషన్ భూమిపూజ స్థల పరిశీలన

చేర్యాల, ఫిబ్రవరి 13 : కొమురవెల్లి గ్రామ శివారులోని రైల్వేగేట్ సమీపంలో రైల్వే హాల్ట్‌స్టేషన్ ఏర్పాటుకు ఈ నెల 15వ తేదీన భూమిపూజ చేయనున్న క్రమంలో మంగళవారం రైల్వే ఎస్పీ అనూప్‌కుమార్ శుక్లా స్థల పరిశీలన చేశారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి సీఎం మోహన్‌యాదవ్ హాజరుకానున్న నేపథ్యంలో ఆయన రైల్వేశాఖ ఉన్నతాధికారులతో పాటు హుస్నాబాద్ ఏసీపీ వాసాల సతీశ్, కొమురవెల్లి తహసీల్దారు లక్ష్మీనారాయణ, చేర్యాల సీఐ శ్రీను తదితరులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. బందోబస్తు చర్యలు, వాహన పార్కింగ్, ఇతరత్రా ఏర్పాట్లపై సమీక్షించి పలు సూచనలు చేశారు.కాగా అంతకుముందు సిద్దిపేట జిల్లా బీజేపీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి కొమురవెల్లిలో విలేకరులతో మాట్లా డారు. భూమిపూజ కార్యక్రమానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఐనాపూర్‌కు చెందిన పలువురు బీజేపీలో చేరారు.

మల్లన్న సన్నిధిలో డివిజన్ అధికారి నీలిమ

చేర్యాల, ఫిబ్రవరి 13 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయాన్ని దక్షిణమధ్య రైల్వే డివిజన్ అధికారి నీలిమ మంగళవారం సందర్శించారు. ఈసందర్భంగా మల్లన్నను దర్శించుకుని అభిషేకం జరిపి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్ స్వామి వారి ప్రసాదం అందించి ఆశీర్వదించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కొమురవెల్లిలో రైల్వేహాల్ట్‌స్టేషన్ ఏర్పాటుతో మల్లన్న భక్తుల కోరిక నెరవేరబోతుందని, ఈనెల15న భూమిపూజ ఏర్పాట్ల పరిశీలనకు వచ్చామని తెలిపారు. పనులు త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు రైల్వేశాఖ చర్యలు తీసుకుంటుందన్నారు. అలాగే అంతకుముందు కాంగ్రెస్ నేత, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ తదితరులు మల్లన్న ఆలయాన్ని సందర్శించారు.



మల్లన్న ఆలయ ఆవరణలో మాట్లాడుతున్న దక్షిణమధ్యరైల్వే డివిజన్ అధికారి నీలిమ

సాగు చేసిన వారికే రైతు భరోసా

● జిల్లా వ్యవసాయాధికారి గోవింద్

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 13: సాగు చేసిన వారికే రైతు భరోసా వర్తిస్తుందని మెదక్ జిల్లా వ్యవసాయాధికారి గోవింద్ అన్నారు. మంగళవారం చిన్నశంకరంపేట, జంగరాయి, చందంపేట గ్రామాల పీఏసీఎస్ కార్యాలయాలను సందర్శించి రైతులు పండించే పంటల ప్రక్రియ నమోదుపై సొసైటీ సీఈవోలకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా యాసంగిలో 2లక్షల 6వేల 921 ఎకరాల వరి, 2297 మొక్కజొన్న, 267 ఎకరాల్లో శనగ, 88 ఎకరాలు వేరుశనగ, 81 ఎకరాలు మినుము, 701 ఎకరాలు తెల్లజొన్న, 10 ఎకరాలు పెసలు. మొత్తం పంటల సాగు 2లక్షల 73,371 ఎకరాలు అని తెలిపారు. రైతు పండించిన ప్రతి పంట సాగును ఏఈవోలు ఆన్‌లైన్లో పొందుపరుస్తారన్నారు. పంటలు సాగు చేయని రైతులు, బీడు భూములకు రైతు భరోసా నిధులు ఇవ్వడం లేదన్నారు. వరి సాగు చేసే రైతులు ఎకరాకు ఒక యూరియా బస్తాను మూడు సార్లు వేయాలన్నారు. పంటల సంరక్షణతో పాటు దిగుబడులు పొందేందుకు రైతులు ఏఈవోల సలహాలు పాటించాలన్నారు. రైతుల కోసం 24 వేల మెట్రిక్ టన్నుల యూరియా సిద్ధంగా ఉందన్నారు. పంటల సాగుబడిపై సొసైటీ సీఈవోలతో పలు అంశాలపై సమీక్షించారు. అనంతరం చిన్నశంకరంపేట, గవ్వలపల్లి గ్రామాల్లోని ఆగ్రోస్ కేంద్రాలను తనిఖీ చేశారు. ప్రతి ఫర్టిలైజర్‌షాపులో రైతులు కొనుగోలు చేసిన క్రిమిసంహారక మందులు, ఎరువు బస్తాలను ఆన్‌లైన్లో పొందుపరిచి, రసీదు ఇవ్వాలన్నారు. నకిలీ విత్తనాలు అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుని, కేసులు నమోదు చేస్తామని దుకాణదారులకు హెచ్చరించారు. ఆయన వెంట ఏవో ప్రవీణ్ ఉన్నారు.



చిన్నశంకరంపేటలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి గోవింద్

కొత్త వంగడాలను వినియోగించాలి : డీఏవో శివప్రసాద్

నారాయణరావుపేట, ఫిబ్రవరి 13: పొద్దుతిరుగుడు సాగులో నూతన వంగడాలను వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ రైతులకు సూచించారు. మంగళవారం నారాయణరావుపేట మండలం లక్ష్మీదేవిపల్లి గ్రామంలో ఎఫ్‌పీవో, భారతీయ నూనెగింజల పరిశోధన సంస్థ అధ్వర్యంలో పొద్దుతిరుగుడు క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు రైతులకు పలు సూచనలు చేశారు. భూమిని సారవంతం చేసేందుకు పచ్చిరొట్ట ఎరువులు వాడాలని సూచించారు. ఎక్కువ దిగుబడి సాధించి ఎఫ్‌పీవో ఆదర్శంగా నిలువాలని సూచించారు. కార్యక్రమంలో ఐసిఎఆర్ డైరెక్టర్ మాథుర్, శాస్త్రవేత్తలు సతీష్ కుమార్, రమణారావు, సురేష్ , ఎఫ్‌పివో చైర్మన్ బొంగురం ఏల్లారెడ్డి, వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



చేగుంట మండలం మక్కరాజ్‌పేట్ గ్రామంలో సస్యరక్షణ కేంద్ర అధికారులు



లక్ష్మీదేవిపల్లి గ్రామంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న డీఏవో శివప్రసాద్

కత్తెర పురుగు నివారణకు చర్యలు తీసుకోవాలి

చేగుంట, ఫిబ్రవరి 13: చేగుంట మండలం మక్కరాజ్‌పేట్ గ్రామంలో హైదరాబాద్ సస్యరక్షణ కేంద్ర అధికారులు మంగళవారం పర్యటించి మొక్కజొన్న పంటలను పరిశీలించారు. కత్తెర పురుగు నివారణకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ సస్యరక్షణ కేంద్ర అధికారి ఎం.రవిశంకర్ సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యాసంగి పంటలో ఆశించే పురుగులు తెగుళ్ల, మొక్కజొన్న, వరి పంటలలో సమగ్ర చీడపీడల నివారణ గురించి శాస్త్రవేత్త రవిశంకర్ వివరించారు. పంటల తెగుళ్లు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపైలలై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

రాయపోల్, ఫిబ్రవరి 13: ఉరేసుకుని ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాయపోల్ మండలం మంతూర్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకున్నది. మంతూర్ గ్రామానికి చెందిన తాళ్ళ బుజ్జమ్మ(45) కొంతకాలంగా మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నది. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన ఆమె ఇంట్లో ఉరేసుకుని ఆత్యహత్యకు పాల్పడింది. సాయంత్రం ఇంటికి వచ్చిన కుటుంబసభ్యులు ఆమెను కిందికి దించగా అప్పటికే మృతిచెందింది. మృతురాలి భర్త తాళ్ళ రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రఘుపతి తెలిపారు.



బుజ్జమ్మ (ఫైల్)

మార్కెట్ చైర్‌పర్సన్‌పై దాడి అమానుషం

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 13: అచ్చంపేట మార్కెట్ చైర్‌పర్సన్ అరుణపై రైతులు దాడి చేయడం అమానుషమని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి గంప శ్రీనివాస్, కార్యవర్గ సభ్యుడు అయిత రత్నకర్, సిద్దిపేట జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు కాసం నవీన్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆమెపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. తూకంలో మోసాలు జరిగితే, గిట్టుబాటు ధర లభించకపోతే చైర్‌పర్సన్‌కు, కార్యదర్శికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలి కానీ, ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడడం సమంజసం కాదని పేర్కొన్నారు.

గంజాయి స్వాధీనం.. యువకుడి అరెస్ట్

కొండపాక, ఫిబ్రవరి 13 : కొండపాక మండలం దుద్దెడ శివారులో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద గంజాయితో సంచరిస్తున్న ఓ యువకుడిని త్రీ టౌన్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. త్రీటౌన్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. దుద్దెడ శివారులో రాజీవ్ రహదారిపై అనుమానాస్పదంగా తిరుగుతున్న యువకుడు పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించాడు. పోలీసులు అతడిని వెంబడించి పటుకున్నారు. విచారించగా తడబడుతూ సమాధానం చెప్పాడు. అనుమానంతో పోలీసులు పూర్తి వివరాలు సేకరించగా తిమ్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన సార్ల మహేష్ (21)అని చెప్పాడు. అతన్ని వద్ద తనిఖీ చేయగా గంజాయి లభించింది. దానిని తూకం వేయగా 24 గ్రాములుగా తేలింది. మహేష్ గంజాయికి అలవాటు పడి సిద్దిపేటలో తాను కూలి పని చేసే దగ్గర తనతో పాటు పని చేసి కూలీలకు ఎక్కువ ధరకు గంజాయి విక్రయించి డబ్బులు సంపాదించాలని మహేష్ వెల్లడించినట్టు ఎస్ఐ తెలిపారు. మహేష్ వద్ద ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకుని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ వివరించారు.

'తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోండి'




ఏవో పరమేశానికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

సంగారెడ్డి రూరల్ ఫిబ్రవరి 13 : అక్రమంగా విధుల్లోంచి తొలగించిన మున్సిపల్ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి డిమాండ్ చేశారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో మంగళవారం ఏవో పరమేశంకు సీఐటీయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులను పనిలో నుంచి తొలగించి, వారి స్థానంలో డబ్బులు తీసుకుని మున్సిపల్ అదనపు శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌బాబు ఇతరులను నియమించారని ఆరోపించారు. అక్రమాలకు పాల్పడుతున్న విజయ్‌బాబుని సస్పెండ్ చేయని పక్షంలో ఈ నెల 16వ తేది నుంచి విధులను బహిష్కరిస్తామని ఆయన హెచ్చరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో మున్సిపల్ యూనియన్ నాయకులు ప్రభు, కిరణ్, రమేష్‌గౌడ్, అనిల్, గణేష్, రాజు తదితరులు ఉన్నారు.

రైస్‌మిల్ వ్యాపారి ఆస్తుల వేలం

నర్సాపూర్, ఫిబ్రవరి 13: నర్సాపూర్‌కు చెందిన రైసుమిల్లు వ్యాపారి శ్రీధర్‌గుప్తా నుంచి జప్తు చేసిన చర ఆస్తులను మంగళవారం నర్సాపూర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ కమలాద్రి నేతృత్వంలో వేలం నిర్వహించారు. వ్యాపారి శ్రీధర్‌గుప్తా సీఎంఆర్ బియ్యానికి సంబంధించి ప్రభుత్వానికి రూ. 47కోట్ల చెల్లించాల్సి ఉండగా, అవి చెల్లించకపోవడంతో ఆయన చర,స్థిర ఆస్తులను జప్తు చేయడంతో పాటు గత నెల 18వ తేదీన శ్రీధర్‌గుప్తాను అరెస్టు కూడా చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం జప్తు చేసిన రెండు కార్లు, రెండు ఏసీలు, టీవీని వేలం వేశారు.



వేలం పాటలో పెట్టిన చర ఆస్తులు



అనంతసాగర్ సరస్వతీ క్షేత్రంలో పల్లకీసేవలో భక్తులు

అనంతసాగర్ సరస్వతీక్షేత్రంలో బ్రహ్మోత్సవాలు

చిన్నకోడూరు, ఫిబ్రవరి 13 : మండలంలోని అనంతసాగర్ గ్రామ శివారులోని శ్రీ సరస్వతీ క్షేత్రంలో వసంత పంచమిని పురస్కరించుకొని మంగళవారం 34వ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారికి మహాభిషేకం, కలశస్థాపన, చతుష్షష్టి ఉపచార పూజ, అగ్నిప్రతిష్ఠ, శ్రీ సరస్వతీ మంత్రహవనం, పల్లకీసేవ, ధార్మిక ప్రవచనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

సాంద్రానందాశ్రమంలో ఘనంగా శతరుద్రీయ హవనం

చేర్యాల, ఫిబ్రవరి 13: కొమురవెల్లి మండలం మర్రిముచ్చాల గ్రామంలోని ఆధ్యాత్మికక్షేత్రం సాంద్రానందాశ్రమంలో కొనసాగుతున్న పాదపూజ మహోత్సవ వేడుకల్లో భాగంగా మూడోరోజు విశేషపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం గణపతిపూజ, చతురాయన సహిత శ్రీరుద్ర యజ్ఞం, శతరుద్రీయ హవనం, దశ మహావిద్యా హవనం, చండీహవనం నిర్వహించారు. అనంతరం సాంద్రానంద స్వామి పాదుకాపూజ, పల్లకీసేవ, దీక్షాహోమం, సాయంతన పూజ జరిపారు. పొరుగుప్రాంతాల నుంచి అధికసంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

రైతు వేదికల్లో వసతుల లేమి

- రెండేళ్లు గడిచినా నీటి సౌకర్యం కరువు
- నిరుపయోగంగా మరుగు దొడ్లు
- అసంపూర్తి పనులతో చేతులెత్తేసిన కాంట్రాక్టర్
- సిబ్బంది, రైతులకు తప్పని తిప్పలు





నారాయణరావుపేటలోని రైతు వేదిక భవనం, నీటి సౌకర్యంలేక నిరుపయోగంగా మారిన మరుగుదొడ్లు

నారాయణరావుపేట, ఫిబ్రవరి 13: రైతులకు అవసరమైన సమాచారాన్ని, పంటల సాగులో మెళకువలను అందించేందుకు గానూ అవగాహన సదస్సులను ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన రైతువేదికల్లో వసతుల లేమి స్పష్టంగా కనిపిస్తున్నది. నారాయణరావుపేట మండలంలో మూడు క్లస్టర్లుగా ఏర్పాటు చేసి నారాయణరావుపేట, జక్కాపూర్, గుర్రాలగొంది గ్రామాల్లో రైతువేదికలను నిర్మించారు. రైతు వేదికల నుంచే రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏఈవోల కార్యాలయాలుగా రైతువేదికలు కొనసాగుతున్నాయి. రైతువేదికలు ప్రారంభించిన నాటి నుంచి ఏఈవోలు అందుబాటులో ఉండి రైతులకు సూచనలు, సలహాలు అందిస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ రైతువేదికల్లో నెలకొన్న అసౌకర్యాలతో రైతులకు, సిబ్బందికి తిప్పలు తప్పడం లేదు.

వసతుల కల్పనలో అధికారులు విఫలం

రైతు వేదికలు నిర్మించి రెండేళ్లు గడుస్తున్నా పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. రైతువేదికలను కాంట్రాక్టర్ అసంపూర్తిగా నిర్మాణం చేసి వదిలేశారు రైతు వేదికలు ప్రారంభించిననాటి నుంచి అందులో పూర్తిస్థాయిలో సౌకర్యాలు లేవని వ్యవసాయ అధికారులు పంచాయతీ రాజ్ అధికారులకు వివరించినప్పటికీ పనుల్లో మాత్రం కదలిక లేదని రైతులు మండిపడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో కాంట్రాక్టర్ నాసిరకంగా నిర్మాణం పనులు చేపట్టాడు. మరుగు దొడ్లు నిర్మించి, వాటికి ట్యాంకులు సైతం ఏర్పాటు చేశారు. కానీ నీటి సరఫరా కల్పించలేదు. కొన్ని చోట్ల నీటి సరఫరాకు పైపులు ఏర్పాటు చేసినప్పటికీ సరఫరా చేసేందుకు కనెక్షన్ ఇవ్వలేదు. మరుగుదొడ్లు నిరుపయోగంగా మారడంతో సమావేశాలకు, అవగాహన సదస్సులకు వచ్చే రైతులతో పాటు సిబ్బందికి తిప్పలు తప్పడం లేదు. అంతేకాకుండా తాగునీటికి సైతం ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా రైతువేదికలకు నీటి సౌకర్యం కల్పించాలని అయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



రైతువేదిక మరుగుదొడ్లు, తాగు నీటి సమస్య ఉన్నది వాస్తవమే. సమస్య పరిష్కారం గురించి అధికారులకు తెలియజేశాం. రైతు వేదిక నిర్మాణం చేసి ప్రారంభించే సమయంలోనే నీటి సమస్య గురించి పంచాయతీరాజ్ శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. పనులు చేసిన కాంట్రాక్టర్ రైతువేదిక వైపు రావడంలేదు. ఉన్నతాధికారుల తెలియజేసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

- వెంకట రమణి, మండల వ్యవసాయాధికారి

వసతులు కల్పించాలి



ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పటిష్టం చేయాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన రైతువేదికల్లో వసతులు కల్పించాలి. రైతు వేదిక భవనం నిర్మాణం అసంపూర్తిగా చేపట్టిన సంబంధిత కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలి. అధికారులు స్పందించి వెంటనే రైతు వేదికల్లో నీటి సరఫరా కోసం ఏర్పాట్లు చేసి అక్కడ నెలకొన్న ఇబ్బందులను తొలగించాలి.

- డి.బాపురెడ్డి, భారతీయ కిసాన్‌సంఘ్ మండల అధ్యక్షుడు

నిరుపయోగ ఎలక్ట్రానిక్ వస్తువుల పునర్వినియోగంపై అవగాహన పెంచుకోవాలి



గజ్వేల్ డిగ్రీ కళాశాల సమావేశంలో మాట్లాడుతున్న టాస్క్ మేనేజ్‌మెంట్ ట్రైనర్ స్వప్న

గజ్వేల్/గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 13: నిరుపయోగ ఎలక్ట్రానిక్ వస్తువుల పునర్వినియోగంపై అవగాహన పెంచుకోవాలని టాస్క్ మేనేజ్మెంట్ ట్రైనీ బి.స్వప్న పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టీఎస్‌కేసీ విభాగం ఆధ్వర్యంలో నిరుపయోగ ఎలక్ట్రానిక్ పరికరాల పునర్వినియోగం, నిర్వహణ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. దేశంలో నిరుపయోగ ఎలక్ట్రానిక్ వస్తువుల సంఖ్య 16శాతం నుంచి 106శాతం పెరిగిందని, వీటి సమర్థవంతమైన నిర్వహణ కోసం ప్రజలకు నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం బడ్జెట్‌లో కొంత మొత్తాన్ని కూడా కేటాయించిందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ గణపతిరావు, సీనియర్ అధ్యాపకులు రమేశ్‌బాబు, లక్ష్మీనర్సయ్య, మార్కండేయ, కైలాష్, పద్మ, కమలాకర్, విద్యార్థులు ఉన్నారు.

క్రీడాకారులకు కిట్లు పంపిణీ



క్రీడాకారులతో జిల్లా యువజన క్రీడాశాఖాధికారి నాగేందర్

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 13: సిద్దిపేట జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో ఈ నెల 16 నుంచి 19 వరకు జరగనున్న జాతీయ అంతర్ జిల్లా జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే సిద్దిపేట జిల్లా క్రీడాకారులకు, కోచ్ మేనేజర్లకు మంగళవారం సిద్దిపేట పట్టణంలో జిల్లా యువజన క్రీడాశాఖాధికారి నాగేందర్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి పన్యాల రామేశ్వర్‌రెడ్డి, టీజీపీఈటీఏ జిల్లా అధ్యక్షుడు ఏర్వ అశోక్ సంయుక్తంగా కిట్లను పంపిణీ చేసి అభినందనలు తెలిపారు. క్రీడా దుస్తులు దాత గ్యాదరి పరమేశ్వర్, బ్యాగ్స్ దాత మెరీడియన్ విద్యాసంస్థలు తమ సొంత డబ్బులతో క్రీడాకారులకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి కర్రోల్ల వెంకటస్వామిగౌడ్, పీఈటీలు కనకరెడ్డి, వెంకట్‌రెడ్డి, కరుణరెడ్డి, నరేష్, కృష్ణ కుమార్, నిశంక్‌గౌడ్, సాయి, లీలా ఆనంద్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా మల్లికార్జున్



హుస్నాబాద్, ఫిబ్రవరి 13: హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా టి మల్లికార్జున్ బదిలీపై వచ్చారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా పని చేసిన మల్లికార్జున్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. ఇక్కడి మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్‌ను సెక్రటేరియేట్‌కు బదిలీ చేశారు.

విలేకరిపై మట్టి మాఫియా దాడి

కొండపాక, ఫిబ్రవరి 13: అక్రమంగా మట్టి తరలింపు వార్తను ప్రచురింపజేశాడనే కారణంతో కొండపాక మండలానికి చెందిన ఓ విలేకరి(ఆంధ్రజ్యోతి కాదు)పై మట్టి తరలిస్తున్న వ్యక్తులు మంగళవారం దాడి చేశారు. వివరాల్లోకి వెళ్తే.. కొమురవెల్లి రైల్వే స్టేషన్ పనుల్లో తీసిన మట్టిని అక్రమంగా తరలిస్తూ వెంచర్లకు అమ్ముకుంటున్నారు. ఈ విషయాన్ని కొండపాక మండలం జప్తినాచారం గ్రామానికి చెందిన ఓ దినపత్రిక విలేకరి యాదగిరి వార్త రాశాడు. దీంతో మట్టి అక్రమ తరలింపునకు పాల్పడుతున్న సదరు వ్యక్తులు కాపు కాసి మోటార్ సైకిల్‌పై వెళ్తున్న యాదగిరిని అడ్డుకొని కొట్టారు. అంతు చూస్తామని బెదిరించారు. బాధితుడు కుకునూర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. రిపోర్టర్‌పై జరిగిన దాడిని టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు రంగాచారి తీవ్రంగా ఖండించారు.

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా నర్సాగౌడ్

హుస్నాబాద్, ఫిబ్రవరి 13 : బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా హుస్నాబాద్‌కు చెందిన పెరుమాండ్ల నర్సాగౌడ్‌ను నియమించినట్లు ఆ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి గొర్ల అయిలేష్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మంగళవారం నర్సాగౌడ్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. బీసీల సామాజిక, రాజకీయ చైతన్యం కోసం, వారి సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా నర్సాగౌడ్ తెలిపారు.

బాబు జగ్జీవన్ రామ్ యువజన సంఘం అధ్యక్షుడిగా రాజమల్లు

దుబ్బాక, ఫిబ్రవరి13: బాబుజగ్జీవన్ రామ్ యువజన సంఘం దుబ్బాక అధ్యక్షుడిగా చెక్కపల్లి రాజమల్లును మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా దొమ్మాట జోగయ్య, కోశాధికారిగా ఇస్తారిగల్ల యాదగిరిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు నర్సయ్య, ఎల్లం, చిన్న రాజు, బద్రి, అశోక్, కరుణాకర్, రాజయ్య, రామచంద్రం, చరణ్ తదితరులున్నారు.

సీసీ రోడ్ల పనులకు నిధులు

ములుగు, ఫిబ్రవరి 13: ములుగు మండలంలో ఉపాధి హామీ పథకం కింద సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 30 లక్షలు మంజూరైనట్లు ఎంపీవో నర్సిం హారావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కొక్కొండకు రూ.5లక్షలు, కొత్తూరుకు రూ. 5లక్షలు, అన్నసాగర్‌కు రూ.5 లక్షలు, నర్సాపూర్‌కు రూ.15 లక్షలు మంజూరైనట్లు వివరించారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్



జడ్పీఎస్ఎస్‌లో విద్యార్థిని అభినందిస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

చేర్యాల, ఫిబ్రవరి 13: సిద్దిపేట జిల్లా అడిషనల్ కలెక్టర్ గరిమా అగ్రవాల్ మంగళవారం చేర్యాల మండలం దానంపల్లి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పల్లెప్రకృతివనం సందర్శించి, మొక్కల పెంపకం, సంరక్షణ చర్యలను పరిశీలించారు. రానున్న వేసవి దృష్ట్యా మొక్కల రక్షణకోసం తగు జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. డంపింగ్ షెడ్‌ను పరిశీలించి తడి, పొడి చెత్త వేరు చేయడం ద్వారా వర్మీ కంపోస్టు తయారీ, పొడిచెత్త విక్రయం ద్వారా జీపీకి సమకూరుతున్న ఆదాయ వివరాలపై ఆరా తీశారు. అనంతరం గ్రామంలోని జడ్పీఎస్ఎస్ పాఠశాల, ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యాబోధనపై ఆరా తీశారు. టీచర్‌గా మారి బోధన చేపట్టి విద్యార్థులను ప్రశ్నించారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నందున ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి 100శాతం ఉత్తీర్ణతతో పాటు 10శాతం జీపీఏ సాధించాలని సూచించారు. తాను అడిగిన ప్రశ్నలకు ఉత్తమ సమాధానం చెప్పిన విద్యార్థిని వైష్ణవిని శాలువాకప్పి అభినందించారు. పాఠశాల ఆవరణలోని మూత్రశాలలు పరిశీలించారు. నీటి వసతి కల్పించడంతో పాటు లీకేజీలు లేకుండా చూడాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పౌష్టికాహారాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని, అంతర్గత సీసీరోడ్ల నిర్మాణం చేపట్టాలని గ్రామస్థులు అదనపు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి, నియోజకవర్గ ప్రత్యేకాధికారి శ్రీరాంరెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో మహబూబ్ అలీ, డీపీవో మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ అవార్డ్సుకు సెయింట్‌మేరీస్ విద్యార్థులు



తమ ప్రాజెక్టుల గురించి వివరిస్తున్న విద్యార్థులు

గజ్వేల్, ఫిబ్రవరి 13: జాతీయ స్థాయిలో కేంద్ర ప్రభుత్వం సైన్స్ అండ్ టెక్నాలజీ పాఠశాల స్థాయిలో ప్రతి ఏటా నిర్వహించే సైన్స్‌ఫెయిర్ అవార్డ్స్ ప్రాజెక్టులో 2023-24 విద్యా సంవత్సరానికి ప్రజ్ఞాపూర్ సెయింట్‌మెరీస్ విద్యానికేతన్ హైస్కూల్‌కు చెందిన 7 ప్రాజెక్టులు ఎంపికైనట్లు పాఠశాల కరెస్పాండెంట్ గోపు ఇన్నారెడ్డి పేర్కొన్నారు. విద్యార్థులను సైన్స్‌లో ప్రోత్సహించడానికి ఏటా ప్రభుత్వం ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది. దరఖాస్తు చేసుకున్న ప్రాజెక్టులను న్యాయనిర్ణేతలు పరిశీలించి అవార్డ్సుకు ఎంపిక చేస్తారు. ఇందులో భాగంగా తమ పాఠశాల నుంచి 7 ప్రాజెక్టులు అవార్డ్సుకు ఎంపికయ్యాయని ఆయన తెలిపారు. ఈ ప్రాజెక్టులను కె. శేషమిహిరాన్ష్, ఎం హరిత, జె. మనస్విని, ఏ. యజ్ఞవాల్క్య, జి.భువనశ్రీ, ఎస్.చైతన్య, ఎం విష్ణువర్ధన్‌రెడ్డి, తయారు చేశారని వివరించారు. ప్రాజెక్టులు ఎంపికకు సహకరించిన గైడ్ టీచర్స్ నాగలక్ష్మి, సంజీవ్‌కుమార్, విద్యార్థులను పాఠశాల కరెస్పాండెంట్ గోపు ఇన్నారెడ్డి అభినందించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారికి గులాబీ పూలు ఇస్తున్న పోలీసులు

కొండపాక, ఫిబ్రవరి 13: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ , మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్, కవిత పేర్కొన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా మంగళవారం వారు రోడ్డు నిబంధనలు, ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్, సీటు బెల్టు తదితర అంశాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. వాహనదారులు ప్రజలలో మార్పు వచ్చినప్పుడు మాత్రమే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని వారు పేర్కొన్నారు. మైనర్ డ్రైవింగ్ ప్రమాదకరం, చట్ట ప్రకారం నేరమన్నారు మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. మోటార్ సైకిల్ వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని ప్రమాదాల నివారణకు కృషి చేయాలని తెలిపారు. రోడ్లకు ఇరువైపులా ఏర్పాటుచేసిన సూచిక బోర్డుల ప్రకారం సేఫ్టీ గా డ్రైవింగ్ చేసి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. కారు నడిపేటప్పుడు సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలని సూచించారు. పార్కింగ్ ప్రదేశాలలోనే వాహనాలు పార్కు చేసుకోవాలని తెలిపారు. రోడ్డు నిబంధనలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించనివారిపై మాత్రమే జరిమానాలు విధిస్తామని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు నిబంధనలను పాటించకుండా హెల్మెట్, సీట్ బెల్ట్ పెట్టుకోకుండా ప్రయాణిస్తున్న పలువురు వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించి గులాబీ పువ్వులు అందజేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది, ఆర్టీవో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రీటింగ్ కార్డులతో అనుభూతులు పంచుకునేవాళ్లం

- ప్రేమికుల దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో పల్లా



పల్లా రాజేశ్వర్ రెడ్డి, నీలిమ దంపతులు

చేర్యాల, ఫిబ్రవరి 13: వారిరువురి భావాలు ఏకీభవించాయి. భిన్న మనస్తత్వాలున్నా మనసులు ఒక్కటై వెంట నడిచేలా చేశాయి. ఓ వైపు చదువులో రాణిస్తూనే విద్యార్థి ఉద్యమాలలో కీలక భూమిక పోశిస్తున్న సందర్భంలో ఏర్పడిన పరిచయం స్నేహంగా మారింది. అది కాస్త మూడుముళ్ల బంధాన్ని మూటగట్టుకునేలా చేసింది. తల్లిదండ్రులు నిరాకరించినా చెక్కుచెదరనీయకుండా వారిని మెప్పించి, ఒప్పించి నిలబడ్డారు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి-నీలిమ దంపతులు. ప్రేమకు అసలైన నిర్వచనంగా నిలుస్తున్న ఆ జంట నేటితరానికి ఆదర్శం. నేడు ప్రేమికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి'తో తన అనుభూతిని పంచుకున్నారు.

ఫస్ట్ నేనే ప్రపోజ్ చేశా..

నేను ఉస్మానియా వర్సిటీలో ఎమ్మెస్సీ పీహెచ్‌డీ, నీలిమ జేఎన్టీయూలో బీ-టెక్ థర్డ్ ఇయర్ చదువుతుండగా ఎస్ఎఫ్ఐ ఆర్గనైజేషన్‌లో పనిచేశాం. విద్యారంగ సమస్యలపై ఉద్యమిస్తున్న సమయంలో ఇరువురి మధ్య పరిచయం ఏర్పడింది. సమాజం పట్ల కలిగిన భావాలు ఏకీభవించడం, ఇరువురి లక్ష్యం ఒక్కటిగా ఉండటంతో ప్రేమకుదారి తీసింది. నేనే ఫస్ట్ నీలిమకు లవ్ ప్రపోజ్ చేయడంతో అంగీకరించింది. ఇరువురి కులాలు వేరే కావడంతో పెద్దలు కొంతమేర నిరాసక్తత కనబరిచారు. తల్లిదండ్రులను ఒప్పించి, మెప్పించేంత వరకు వేచి చూశాం. నాలుగేళ్లపాటు ప్రేమప్రయాణం సాగిన క్రమంలో గ్రీటింగ్ కార్డుల ద్వారా మా అభిప్రాయాలు, అనుభూతులను పంచుకునేవాళ్లం. 1991లో ఖమ్మంలో స్టేజ్‌మ్యారేజ్ ద్వారా పూలదండలు మార్చుకున్నాం. ఇప్పటికీ మామధ్య ఎలాంటి మనస్పర్థలు తలెత్తకుండా సాఫీగా సాగుతున్నాం. నన్ను అర్థం చేసుకుని నా ప్రతీ విజయంలో వెన్నంటి ప్రోత్సహిస్తున్న నీలిమ నాకు నిజంగా దేవుడిచ్చిన శ్రీమతి బహుమతే. నాటి కాలం ప్రేమలో నమ్మకం, స్వచ్ఛత ఉండేది. కానీ ప్రస్తుతం కొంతమంది యువత ప్రేమపేరిట అఘాయిత్యాలకు పాల్పడటం కలచివేస్తుంది. మనిషికి ప్రేమ ఎంత ముఖ్యమో చదవడం, తల్లిదండ్రులను గౌరవించడం, జీవితంలో స్థిరపడటం కూడా అంతే ముఖ్యం. ప్రతీ వ్యక్తి జీవితంలో ఎదుగుదల ఉండాలి. ప్రేమ కోసం కుటుంబాన్ని ఒప్పించండి. ఇతరులకు ఎలాంటి సమస్యగా మారకుండా ఎదిగి ఆదర్శంగా నిలబడాలి. ఆత్మహత్యలు, అఘాయిత్యాలకు పాల్పడకూడదు. అప్పుడే ప్రేమ బ్రతుకుతుంది. మీరూ నిలబడతారు.

'ఆపన్న హస్తం' సేవలు అభినందనీయం



గజ్వేల్‌లోని సమీకృత మార్కెట్‌లో రక్తదానం చేస్తున్న ఏసీపీ రమేశ్

గజ్వేల్, ఫిబ్రవరి 13: ఆపన్నహస్తం మిత్ర బృందం అందిస్తున్న సేవలు అభినందనీయమని శాసనమండలి సభ్యులు డాక్టర్ వంటేరు యాదవరెడ్డి, గజ్వేల్ ఏసీపీ మడత రమేశ్ కొనియాడారు. గజ్వేల్ పట్టణంలోని సమీకృత మార్కెట్‌లో ఆపన్నహస్తం మిత్ర బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీపీ రమేశ్ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని తెలిపారు. తనకు రక్తదానం చేసే అవకాశం కల్పించిన ఆపన్నహస్తం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

20న రామలింగేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు

మద్దూరు, ఫిబ్రవరి 13: ఈ నెల 20న దూళిమిట్ట మండలం బెక్కల్ గ్రామంలోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం హుండీ లెక్కింపు, వేలం పాటలు ఉంటాయని దేవస్థాన కార్యనిర్వహణాధికారి పీవీ శర్మ తెలిపారు. ఈ నెల 20న ఉదయం 11 గంటలకు హుండీ లెక్కింపుతో పాటు జాతర సందర్భంగా టెంకాయ, ప్రసాదాలకు వేలం పాటలు నిర్వహిస్తామన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో స్వయం పాలన



బందారం పాఠశాలలో స్వయంపాలనలో టీచర్లతో విద్యార్థులు

కొండపాక, ఫిబ్రవరి 13 : మండలంలోని బందారం ఉన్నత పాఠశాలలో విద్యార్థులు మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి బోధన చేశారు. డీఈవోగా హారిక, ఎంఈవోగా అనూష, ప్రధానోపాధ్యాయుడిగా అనిల్‌కుమార్, పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు మహేందర్‌రెడ్డి పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులతో పాటు పాఠశాలకు మైక్ సెట్‌ను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రామచంద్రం, ఉపాధ్యాయులు వెంకటరెడ్డి, నర్సిరెడ్డి, శ్రీనివాస రెడ్డి, భాగ్యలక్ష్మి, ప్రభాకర్, సత్యనారాయణ, సుభాషిని, బాబు పాల్గొన్నారు.

చిట్యాల ప్రాథమికోన్నత పాఠశాలలో..



స్వయంపాలనలో ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు

చేర్యాల, ఫిబ్రవరి 13 : చేర్యాల మండలం చిట్యాల ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు విద్యా బోధన చేశారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి



రిమ్మనగూడలో సీసీ కెమెరాలను ప్రారంభించిన సీఐ సైదా

గజ్వేల్, ఫిబ్రవరి 13: గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా కోరారు. మండలంలోని రిమ్మనగూడ గ్రామంలో నేను సైతం కార్యక్రమంలో భాగంగా నాలుగు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. గ్రామపంచాయతీ పక్కన గల వీధిలో కొన్ని రోజుల క్రితం చోరీ జరుగగా ఇటీవల సీఐ సైదా పర్యటించి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. దీంతో స్పందించిన కాలనీవాసులు నాలుగు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోగా, వాటిని సీఐ మంగళవారం ప్రారంభించారు.

బదిలీ అయిన ఎంపీడీవోకు సన్మానం



ఎంపీడీవోను సత్కరిస్తున్న మాధురి

కొండపాక, ఫిబ్రవరి 13 : కొండపాక ఎంపీడీవోగా విధులు నిర్వహించిన రాంరెడ్డి నల్గొండకు బదిలీ అయ్యారు. దీంతో సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షురాలు చిట్టి మాధురి మంగళవారం రాంరెడ్డికి సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఐదేళ్లపాటు ఆయన మండలాభివృద్ధికి ఎంతో కృషి చేశాడన్నారు.

మిరుదొడ్డి పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడిగా ఫహీం



పంచాయతీ కార్యదర్శుల సంఘం నూతన కమిటీ సభ్యులు

మిరుదొడ్డి,ఫిబ్రవరి13: మిరుదొడ్డి మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడిగా ఫహీం(మిరుదొడ్డి కార్యదర్శి)ని మంగళవారం ఎంపీవో జహీరోద్దీన్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే ఉపాధ్యక్షులుగా షాబానా బేగం, కార్యదర్శిగా అశోక్, కోశాధికారిగా ప్రశాంత్, కార్యవర్గ సభ్యులుగా రవీందర్, రవి, ఉషారాణి, తులసి, మహేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్ అనాలోచిత నిర్ణయాలతో రాష్ట్రానికి అన్యాయం: వంటేరు



బీఆర్ఎస్ నాయకులతో కలిసి బస్సులో నల్గొండ సభకు వెళ్తున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి తదితరులు

గజ్వేల్, ఫిబ్రవరి 13: కాంగ్రెస్ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలతో రాష్ట్రానికి అన్యాయం జరుగనున్నదని టీఎస్ ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలసి బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చేపట్టిన ఛలో నల్గొండ బహిరంగ సభకు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి కృష్ణా జలాలను అప్పగించాలని నిర్ణయించడంతో రాష్ట్రంలోని ఉమ్మడి ఐదు జిల్లాలకు అన్యాయం జరుగనుందన్నారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలతో మేడిగడ్డకు వెళ్తున్నారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ పార్టీ అబద్ధపు ప్రచారాన్ని చేస్తున్నారని, అసలు కాంగ్రెస్ పార్టీ నాయకులకు కాళేశ్వరం ప్రాజెక్టుపై అవగాహన ఉందా అని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టు ద్వారా సిద్దిపేట ప్రాంతమంతా సస్యశ్యామలం అయిందన్నారు. వారితో నియోజకవర్గానికి చెందిన నాయకులు ఉన్నారు.

నల్లగొండకు తరలిన గులాబీ శ్రేణులు

- **చేర్యాల:** కృష్ణాజలాలపరిరక్షణ కోసం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేపట్టిన నల్లగొండ సభకు మంగళవారం చేర్యాల, కొమురవెల్లి మండలాల నుంచి పార్టీ నాయకులు భారీగా తరలివెళ్లారు.
- **కొండపాక:** నల్లగొండలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన కేసీఆర్ భారీ బహిరంగ సభకు కొండపాక మండల పార్టీ అధ్యక్షుడు నూనె కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తరలి వెళ్లారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి మాజీ మండల కన్వీనర్ రాగల దుర్గయ్య, ముత్యాల కనకయ్య, పిడిశెట్టి శ్రీనివాస్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తదితరులు ఉన్నారు.
- **ములుగు:** కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరక్టర్ బట్టు అంజిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం నల్లగొండలో బీఆర్ఎస్ పార్టీ నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభకు బయలుదేరారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ దేవేందర్‌రెడ్డి, పాక్స్ వైస్ చైర్మన్ నరేష్‌గౌడ్, జుబేర్, లింగారెడ్డి, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.
- **తొగుట:** నల్గొండలో కృష్ణానది నీటిహక్కుల పరిరక్షణ కోసం చేపట్టిన బీఆర్ఎస్ బహిరంగ సభకు తొగుట నుంచి బీఆర్ఎస్ నేతలు బస్సులో తరలివెళ్లారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొమురయ్య, వైస్ చైర్మన్ రాంరెడ్డి, రైతుబంధు మండల అధ్యక్షుడు కనకయ్య, ఎంపీటీసీ కొమ్ము శరత్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డి, యూత్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.